# సృజన సాహిత్యం

## ఏకత్వం నుండి అనేకత్వానికి - రాగ ప్రస్తారం

# డా॥ ఎన్.గోపి 'మగ్న సంగీతం'

'కా'లాన్ని నిద్రపో'నివ్వని ఈ నాటి మహాకవి, 'నానీ' సృజనకర్త. 'జలగీతం' కావ్యకర్త డా॥ ఎన్.గోపిగారి గురించి పరిచయ వాక్యాలన్నీ – ఒక గ్రంథ పరిచ్ఛేదం అవుతుంది. అందుకనే, స్పష్టాతిస్పష్టంగా – 'నన్ను తెలుసుకోవాలంటే/ నా కవిత్వంతోనే / బయోడేటా వేస్ట్' అనేశారు 'పెహ్చెన్' కవితలో. డా॥ గోపిగారి 31వ కవితా సంపుటి– 'మగ్న సంగీతం' ఈ ఏటి కవిత్వ ఫలసాయం.

**కవి నిమగ్నం కావటమంటే, సమష్టి తత్త్వంలో లీనమవుతూ ఆ సమష్టికి కవిత్వంలో ప్రాణప్రతిష్ఠ చేయటమే. 'మగ్న సంగీతం' పద్యంలో మొదటి నాలుగు పాదాలే ఈ విషయానికి నిదర్శనం. కవి అంటున్నారు– 'నేను కవితలో వున్నాను/ వెలుపల కాదు/ చీమలా పాకుతూ/ మనిషిని వెతుకుతున్నాను' అని. ఇదే మగ్నత. ఆ తర్వాతి చరణాలు సంగీతాన్ని వినిపిస్తాయి. వెలుపల వుండి లోపలతో మమేకంగా కూడా వుండటమే మగ్నత. 'మనిషి'ని వెతకటమే 'కవిః క్రాంత దర్శీ' అంటే! అదీ గోపిగారి కవిత్వ పరిపుష్టి!.**

మనుషుల్ని వెతుకుతున్న మహాకవికి, మహామనీషికి ముందుగా 'చేతులు' కనిపించాయి. ఏమా చేతుల రూపం? చూడండి:

'పని తప్ప మరేమీ తెలియని చేతులు, రాళ్ళు కొట్టి బీటలు వారిన చేతులు/ భూమిలో విత్తనాలు నాటి/ పైరును పైకి లాగే పసిడి చేతులు/ కన్నీరు తుడిచే ఆర్ద్రమైన చేతులు/ ఆ భవనాలను శ్రద్ధగా వీక్షించండి/ చీల్చుకొని పోయే / ఆ పడవల్ని గమనించండి / వాహనాలను నడుపుతూ, దూరాలను మడతపెడ్తూ/ గమ్యాలకు చేర్చే/ అనుబంధాల చేతులు/ హృదయాలను పెనవేసే చేతులు/ సంస్కృతిని సృష్టించే చేతులు / సృజనాత్మకమైన చేతులు/ నిజానికి భూగోళానికి / చేతిబొమ్మను అతికించాలి/ విశ్వాంతరాళంల /దాని చిరునామా ఈ చేతులే..'.... /ఇవాళ/ ఈ చేతులకే చెయ్యెత్తి నమస్కరిస్తాను/ ఈ కవితను రాస్తున్న/ నా చేతిని కూడా/ వీటికి అంకితం చేస్తున్నాను.'

ఈ చివరి వాక్యాల్ని చదివితే నిమగ్నత కవితామయం కావటం, సమూహంతో కవి మమేకం కావటం ఆలోచనీయంగా వెంటాడుతుంది. అందుకనే 'పరంపర' లో 'అంతరంగ ప్రయాణానికి /వాహనం అక్కర్లేదు' అనీ 'కన్నీళ్ళను వేరు చేసి చూడకు/ ఉద్వేగానికి విశ్లేషణ అక్కర్లేదు' అనీ కవి అభివ్యక్తి తీవ్రతతో హితోక్తినిస్తున్నారు. సంపుటి నిండా పరచుకున్న ఈ మగ్నసంగీతరవళి చివరిపద్యం 'మానవభాష'లో తారాస్థాయికి వెళ్లింది. 'జీవితం నిడివి/ చిన్నదే కావచ్చుగాని/ దాని వైశాల్యం పెద్దది' అని 'ఏ వ్యక్తీ మరో వ్యక్తిలా ఉండదు / కాని లోపలికి తొంగిచూస్తే / సకల నరాల్లోని /స్పందన ఒకటే / ఇదే మానవ భాష!' అని సందేశాన్ని స్ఫూర్తిమంతం చేశారు.

'విరామం' అంటూ ఒక తేజోరేఖ వుంది ఈ సంపుటిలో. 'జనంతో సంబంధం/ ఒక తవ్వకం పని లాంటిది/ గుండెలోంచి రాళ్ళొస్తాయో, రత్నాలొస్తాయో వేచి చూడాలి' అంటూ సామాజిక నిమగ్నతలోని కష్టాన్ని ధ్వనించారు. చివరికి 'తీరిక / జీవన వస్త్రంపైన ఒక చారిక/ ఉతికేసుకోవడమే ఉత్తమం/ మరణం అంటే/ ఊపిరి ఆగిపోవటం కాదు/ నిర్వ్యాపారతీరమే/ ఒక మృత్యుద్వారం' అన్నారు. బతుకు అర్థాన్ని విడమరుస్తూనే తత్త్వబోధసారాన్ని కవిత్వం గుళిక చేసి అందించారు.

పరిణామశీలమైన కాలతత్త్వాన్ని అవగాహన చేసుకోవటమే కాక, కాలికస్పృహనీ స్పర్శించే దర్శనాన్నీ, ఆదర్శనాన్నీ కూడా ప్రోది చేసుకున్న కవి– గోపిగారు. 'మానవుని మౌలిక సంవేదన మారుతుందా?' అని సూటిప్రశ్న!!

ఈ మౌలిక సంవేదనని దృశ్యమయంచేస్తూ వర్తమాన సమాజ చిత్రణని, అనుద్వేగకరంగా కవితామయం చేశారు గోపిగారు.

'అతడు వీరుడు/ అతణ్ణి బతికించండి.... పలు ప్రజా ఉద్యమాలకు / ప్రాణం పోసినవాడు /ఎందరికో దారి చూపిన వాడు/ ఇప్పుడతని కనులు / మూతపడనీయకండి..' అని జనాన్ని వేడుకుంటున్నాడు కవి. 'అంబులెన్స్'కి దారి ఇవ్వమని అభ్యర్థన. 'తరం తరం' అంతరం చూపుతూ 'వద్దువద్దంటూనే / జారిపోతున్నాం / కొత్తబూట్లలో పాతకాళ్లు, ఎన్నడూ లేనంత వేగంతో / సగటు మనిషి ఆగమాగం' అంటూ మనుమడు మా అమ్మను చూడటానికొచ్చినట్టున్నాడు' అని పరిణామహేలకు ఆశ్చర్యార్థకాన్నే చూపుతారు.

గోపిగారు 'పేషంట్' గురించి రాసినా 'జాతర' లో 'జీవితాన్ని జీవించడమే మంచిది/ అది యాంత్రికత కాదు/ అలజడుల మాంత్రికత' అని వాస్తవికతా దృశ్యాన్ని చిత్రీకరించినా, 'క్షురకార్మికుడు' స్మరణకొచ్చి నిలవేసిన 'యాంటిక్ గా మారని' కుండని చూపించినా, సంస్కృతి పరిమళాన్నే పర్యాప్తి చేస్తారు.

మెట్టిన నగరం, చుట్టివచ్చిన దేశాలు ఎలా వున్నాయో ఎన్నిరీతుల వర్ణించినా, గోపిగారి హృదయస్పందన, కవితాత్మ–పుట్టిన ఊరు 'భోనగిరి గుట్ట' చుట్టూ పరిభ్రమిస్తూనే వుంటుంది.

కొద్ది అక్షరాల్లోనే వర్తమాన, సామాజిక సంక్షుతకు అద్దం పడుతున్నారు కవి. ఈ కవిత ముగింపు– 'యుద్ధం లేకుండానే / శిథిలమవుతున్న ఊళ్లు/ నెక్ట్ షాట్లోనే/మంటల మధ్య మానవుడు' వాక్యాలు ప్రపంచాన్ని నిలువనీయని అశాంతిని ఆవిష్కరిస్తున్నాయి.

'దెలివరీ బాయ్' అని పద్యం. మీకూ నాకూ బాగా పరిచితమైన యువకుడే. కవి గోపిగారికి అనంత సంవేదనను పంచుతూ వచ్చిపోతున్నాడు. 'తండ్రికన్న కలల ఫలం/ ఇవాళ వీధుల పాలయ్యింది/ఇది నిరుద్యోగ ఉద్యోగం/ నిరాశ పడని వీరుడతడు'.... 'పని ఏదైనా కానీ/ గ్లోబలైజేషన్, ఇవాళ వీధిలో సంచరిస్తుంది/ దేశాన్ని శాసించగల యువతను / బానిసలుగా మార్చేసింది' అనేది కవి అశాంత చిత్తం నిశ్శబ్ద ఆక్రోశం! 'మార్పు/ నిజానికి నిట్టూర్పు/ కానీ అది/ కదిలే కాలం అని చెప్పే కల్లోల తీర్పు' అని సమస్యా చిహ్నాలకు పరిష్కారం లేని జవాబుని ఈనాటి రీతీ రివాజుకు అనుసంధానం చేస్తారు. 'కలాయివాలా' లు కాలంలో కలిసిపోయినా, 'అతని 'నేను ఎలా భావిస్తే/అలాగే కనిపిస్తుందది/ ముఖ్యంగా ఏనుగులాగ/ పైన ఖిల్లా దాని వీపుమీద/అంబారీలా అమిరింది/ వర్షం కురిసిన చారలు/ దాని మదజలంలా స్రవిస్తాయి.

'గుట్ట మా ఊరు నుంచి/ పక్క ఊరి దాకా వ్యాపించి వుంది/....ఆ గుట్ట ఔన్నత్యం/ తల పైకెత్తి తిరగడం నేర్పింది నాకు/ గుట్ట పైకెక్కి చూస్తే దూరంగా హైదరాబాద్ లైట్లు మిణుక్కుమంటాయి.'....నమ్మండి/ గుట్ట రాతికి చెవిపెట్టి వింటే/ ఏవో పురా సంభాషణలు వినిపిస్తాయి/ ఏదైనా దుఃఖం వాటిల్లినప్పుడు / దానిముందు నిల్చొని చెప్పుకునే వాణ్ణి/ గుట్టలేకుండా/ జీవితాన్ని ఊహించలేన్నేను/ ప్రపంచంలో పలు దేశాలు తిరిగాను/ అయినా ఇప్పటికీ / భోనగిరి గుట్టే నా చిరునామా.

'అమ్మ' గురించి రాయని కవి ఎవరున్నారు? 'అమ్మ అనే రెండక్షరాలు / అదే ఒక బృహత్కావ్యం' అంటూ 'అవసరమున్నంతవరకే అమ్మ/ తీరినంక మమకారానికి దుమ్మా... పాపం అమ్మ/ ఇవాళ విరిగిపోతున్న కొమ్మ' అని వాస్తవం కదలికలోని జారుడుమెట్ల ఇక్కట్లని వ్యక్తీకరించారు. గోపిగారి సామాజిక దృష్టి–ఆ సమాజ పోకడల విభిన్న చిత్రాల్నే చూస్తుంది. అయితే ఆ చూపు అనుద్వేగకరమైన, భావగర్భితమైన కవితాభివ్యక్తికి వాహిక అవుతుంది. గాఢమైన, సాంద్రతరమైన కవి భావనలకు 'మానవ సంవేదనే / జీవితంలో పేరిన తేట' అనే వ్యక్తిత్వంలోని చిత్తశుద్ధి, సాహిత్య వ్యక్తిత్వంలోని నిబద్ధతా శుద్ధి మూలబలం!

**డా॥ గోపిగారి కవిత్వ శిల్పం ఒక ప్రత్యేకముద్రని సంతరించుకుని వుంటుంది. పద్యాలన్నీ చరణాలు చరణాలుగా సాగుతాయి. ఎత్తుగడ చదువరికి స్వాగతం పలుకుతూ, ఉత్కంఠ ప్రేరకంగా వుంటుంది.**

'విజ్ఞానం పెరిగే కొద్దీ / అశాంతి కూడా పెరుగుతుంది' అని మొదలవుతుంది 'తీర్పు'. ఈ రెండు వాస్తవాల వివరణ ఆ తర్వాతి చరణాల్లో కవితామయం అవుతుంది. 'ఏడుపువేరు/ దుఃఖం వేరు/ మొదటిది రెండోదానికి / మాధ్యమం మాత్రమే' అనేది 'దుఃఖం' ఖండిక మొదలు!.

కవిత్వంలో దృశ్యీకరణం ఒక శిల్ప విశేషం. 'అదే మా యిల్లు అని/ దూరం నుంచి చూపించాడు' అనగానే పరిచితమైన దృశ్యాలూ, పరిచితం కాని ఉత్సుకత రెండూ మనసున ముసురుతాయి. 'ఉపాధ్యాయుడు బదిలీ అయ్యాడు / స్కూలు స్కూలంతా ఘొల్లుమంది/ ఆవరణలోని / గాలి కూడా చిన్నబోయింది' అనగానే మొదటి రెండు పాదాల్లోని సంభవం ఆర్తిజనకంగా చదువరిని కుదుపుతుంది. ఆ తర్వాతి రెండుపాదాల్లోని అభివ్యక్తి – కవిత్వాన్ని మౌనంగా అనుభూతి ప్రవాహాన్ని చేస్తుంది. సాధారణ సంఘటనే – కానీ కవిత్వభాషలో మానవీయ స్పందనను ప్రచోదనం చేస్తున్నది. భావగర్భితంగా జీవిత సంక్లిష్టతని నిబిడీకృతం చేస్తున్నది.

డా॥ గోపిగారి కవిత్వానికి వారి ఆత్మీయతాముద్ర పునాది. అన్ని పద్యాల్లోనూ అంతో ఇంతో–ఎడనెడ–అంతా–ఆ వైయక్తిక అనుభవాల వ్యక్తీకరణం ఉంటుంది. కంఠస్వరంలో వారి వ్యక్తిత్వం సాధించుకున్న సత్త్వశక్తీ, సౌమ్యతారక్తీ ధ్వనిస్తూ వుంటాయి. ఈ సంపుటిలోని 'సాహిత్య అకాడెమీ', '51వ పెళ్ళిరోజు' వంటివి మరీ ప్రధాన నిదర్శనాలు.

'మగ్న సంగీతం' సంవేదకుని ఉద్విగ్నమనస్కతకు దర్పణం. అలాగే, వర్తమాన సామాజిక కల్లోలాల తీరుపట్ల ఒక చింతనాత్మకుని భావలహరి!!

-విహారి,
98480 25600

## The Butterfly Effect

ఆమెలో ఏమున్నదో నాకు తెలియదు
నాలో లేనిది ఏదో ఆమెలో ఉన్నదని మాత్రం తెలుసు
బహుశా శీతాకోక చిలుక ప్రభావం అంటే అదేనేమో!

ఆమె పుట్టినప్పుడు నేనెక్కడున్నానో తెలీదు
నేను పుట్టినప్పుడు ఆమె ఎక్కడుందో తెలీదు
కానీ, నా కోసం ఆమె వెతుకులాట
అప్పుడే మొదలయింది
ఆమె కోసం నే కవిత రాయడం
అప్పుడే మొదలెట్టాను
బహుశా శీతాకోక చిలుక ప్రభావం అంటే అదేనేమో

చాలా కాలానికి మేమిద్దరమూ కలసినప్పుడు
ఆమె నన్ను గుర్తించలేదు ,నేనామెను గుర్తించలేదు
కానీ మమ్మల్ని ఇద్దరినీ
ఒక శీతాకోక చిలుక గుర్తించింది
నా చేతిమీద వాలి
కొన్ని అక్షరాలు తీసుకుని ఆమెకిచ్చింది
ఆమె నుండి కొన్ని నవ్వులను తెచ్చి నాకిచ్చింది

వెన్నెల రాత్రి,నది ఒడ్డున ఆమె కూర్చున్నప్పుడు
నది ఆమెలోకి ప్రవహిస్తుందో
ఆమె నదిలోకి ప్రవహిస్తుందో తెలీదు కానీ
వాళ్ళిద్దరి సంభాషణ వినడానికి బావుంటుంది
ఆ వినడం కోసమే నేనామె సమక్షంలోకి వెళతాను

నేనొక్కడినే దిగులు ముసిరి ఒంటరిగా ఉన్నప్పుడు
ఆమె తనతో ఒక పాటను తీసుకుని వచ్చి
ఇక విను అంటుంది
మరు క్షణంలో ఆమె
పాటల పూలతోటగా మారుతుంది.

పాట పూర్తి అవుతూనే
నేను కొత్తగా మళ్ళీ పుడతాను
ఆమె ఒంటిని లెక్కలేనన్ని
నెత్తుటి చారికలు అంటుకుంటాయి
బహుశా శీతాకోక చిలుక ప్రభావం అంటే అదేనేమో!

చివరకు ఒక చీకటి రాత్రి ఆమె నన్ను విడిచి వెళ్ళింది
ఒక్కడినే ఉండలేక నేనూ వెతుక్కుంటూ వెళ్ళాను
ఆమె ఆ నీలాకాశంలో ఒక తారలా మారింది
నేనొక ఉల్కలా జారి సముద్రంలో పడిపోయాను
శీతాకోక చిలుక ప్రభావం అంటే అదేనేమో!

-వంశీకృష్ణ
95734 27422

## గంగవరపు సునీతకు సాహిత్య పురస్కారం

ఉయ్యూరు కేంద్రంగా పనిచేస్తున్న డా. శ్రీమతి శ్రీకాకుళపు జాయ్ అడియల్ మేరీరాయ్ స్మారక ట్రస్ట్ రెండవ ఏడాది ఉత్తమ సాహిత్య పురస్కారానికి ప్రముఖ కవయిత్రి శ్రీమతి గంగవరపు సునీత ఎంపిక అయినట్లు ట్రస్టు చైర్మన్ శ్రీకాకుళపు రాజ్ కుమార్ తెలిపారు. జనవరి 2026లో విజయవాడలో యం3 (మాదిగ మిత్ర మండలి) ఆధ్వర్యంలో జరిగే సభలో 25 వేలు నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తారు. కార్యక్రమాన్ని అనిల్ డ్యాని నిర్వహిస్తారు.

- యం3 సాహితీ విభాగం

## తల్లి భారతి

ముడతలు పడిన ఆమె చర్మం చూస్తే,
ఎండిపోయిన ఉద్యాన వనాలు గుర్తొస్తాయి.
గాయాల పాలైన ఆమె శరీరం చూస్తే,
గోతులు పడిన కంకర రోడ్లు గుర్తొస్తాయి.

కాంతి కోల్పోయిన ఆమె కళ్ళు చూస్తే,
వెలగడం మరిచిన వీధి దీపాలు గుర్తొస్తాయి.
అట్టలు కట్టిన ఆమె జుట్టును చూస్తే,
వరదలో మునిగిన ఊర్లు గుర్తొస్తాయి.

ఆమె ఒక తల్లి ...
మమతలు పంచిన తల్లి,
ప్రేమను పొందని పిచ్చి తల్లి,
మగని కోల్పోయిన ముసలి తల్లి,
అందరూ ఉండి కూడా అనాథ అయిన తల్లి,

ఉన్న ఒక్క కొడుకూ వదిలేసిన
అమాయకపు తల్లి,
తన కోసం ఎవరో వస్తారని
ఎదురుచూసే సగటు తల్లి,
అయినవాళ్ళు తనను వదిలేసారని
తెలియని వెర్రి తల్లి.

ఉమ్మడి కుటుంబంలో బాగా బ్రతికిన ఆమె,
అనుబంధాల లోగిలిలో
ప్రేమను పంచిన ఆమె,
ఆత్మీయతను వడ్డించి నిండా మురిసిన ఆమె,
మగని మరణంతో ఒంటరిగా మిగిలిన ఆమె,
ఆస్తులు లాగేసుకున్న కన్న బిడ్డచే
గెంటేయబడ్డ ఆమె,
వాడి పారేసిన విస్తరాకులా
గాలికెగురుతుంది ఆమె,
ఆప్తుని కోసం ఆఖరి క్షణం దాకా
ఎదురుచూసింది ఆమె,
ఆశలుడిగి పోయాక
అనాథ శవమయ్యింది ఆమె.

అంతా చూసిన దేవుడు
భారంగా నిట్టూర్చాడు,
అంతా తెలిసిన భావి పౌరుడు
ఆలోచనలో పడ్డాడు,
చూసిన పాపం తుడిచే దిశగా
అడుగు ముందుకేసాడు,
చూద్దాం..
పెద్దరికం వహిస్తాడో,
పెద్దలనే అనుసరిస్తాడో?!

-గారపాటి సూర్యనారాయణ (సూనాజి)
94901 25692

## బ్రో...

ఏది ఇక్కడితో ఆగిపోదు
గడుస్తున్న కాలం లాగే!
రాత్రుళ్లు కళ్ళనిండా
కలలు కూడా ఆగిపోవడం లేదు.

నీ అవసరం ముగిసిన చోట
నీకిచ్చే గౌరవం కూడా ముగుస్తుందని.

ఒకప్పుడనుకునేవాణ్ణి
జీవితం మహాద్భుతమని!
గాజు గ్లాసులా
నీటి తెమ్మరలా ఉంటుందని!

ఆట
మొదలయినపుడు తెలిసింది
అశాంతి కూడా
మెత్తగా దిగుతుందని

నిజానికి బాధని ఎంత చెప్పినా
ఎవరి చర్మంలోకి ఇంకదు
ఇపుడైనా అంగీకరిస్తారా బ్రో!
ప్రకృతి మనిషికి గురువని
ప్రతిదీ మొదలు పెట్టడం సులువే!
పోరాటం లా
ప్రేమించడమే కష్టం.

-ఏటూరి నాగేంద్రరావు
7416665323

## పాఠకుల పిడికెడు గుండెను దుఃఖ దగ్ధం చేసే అక్షర క్షిపణి - 'కోకారో' నవల

**'కొండ మిరపకాయ చూడడానికి కొంచమే వున్నప్పటికీ, కొరికి చూస్తే తెలుస్తుంది దాని పవర్ ఏమిటో?!' అన్నట్టుగా 'కోకారో' నవల చూడడానికి చిన్నగానే వున్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అటు పాఠకులను ఇటు ప్రేక్షకులను కూడా విపరీతంగా ఆకట్టుకుంది. అలరించింది.**

ఈ నవల దాదాపుగా ఉత్తమ పురుష మరియు అలగరి కథన పద్ధతిలో నడుస్తుంది. నవల ఎత్తుగడ నుండి ముగింపు వరకు పాఠకుణ్ణి పంక్తుల వెంట పరుగులు పెట్టిస్తుంది. ప్రధాన పాత్రలు నాలుగే నాలుగు. అందులోనూ ప్రధానమైనది సెన్సే పాత్ర. ఇతనే ఈ నవలకు నాయకుడు. ఎటువంటి నాయకుడంటే మన తెలుగు సినిమా 'గుడిగంటల్లో' ఎన్టీఆర్ తరహాలాంటి నాయకుడన్న మాట. కాకపోతే తెలుగు సినిమా ఫార్ములా పరిధి మేరకు ఎన్టీఆర్ పాత్రను మల్చినట్టుగా మలవకుండా నవలా వస్తువు కోరిన విధంగానే ముగింపు నిచ్చిన రచయిత 'సొసెకి నట్సు మే' నవలను విషాదాంత ముగింపుతో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో భాషల్లో పాఠకులు ఊహించనంత ఎత్తున నవలను, అందులోని పాత్రల తీరుతెన్నులను అద్భుతంగా మలచి, ఓ మరపురాని, మరువలేని గొప్ప క్లాసిక్ గా ప్రపంచ పాఠకుల ముందు నిలిపాడు.

ఓ యువకుడు తన మిత్రునితో గడిపేందుకు 'కమలారా' అనే పట్టణానికొస్తాడు. ఇతను వచ్చిన

మరునాడే ఆ మిత్రుని తండ్రికి బాగోలేని కారణంగా వెంటనే ఇంటికి రావాల్సిందిగా సమాచారం రావడంతో తను వెళ్ళిపోయినా కొత్త యువకుడు మాత్రం ఆ గదిలోనే వుండిపోతాడు.

సముద్రతీరంలో అతనికి సెన్సే అనే వ్యక్తితో అనుకోకుండా పరిచయం ఏర్పడుతుంది. తరువాత కొద్దిరోజులకే సెన్సే కమలారా నుండి టోక్యో వెళ్ళిపోతాడు. ఆ తరువాత మరికొద్ది రోజులకు ఆ యువకుడు కూడా టోక్యో వెళ్ళిన తరువాత వెతుక్కుంటూ వెతుక్కుంటూ ఒకనాడు సెన్సే ఇంటికి వెళతాడు. సెన్సే భార్య "తను ప్రతి నెలా ఇదే రోజున జోషిగాయాలోని ఓ సమాధిని సందర్శించడానికి వెళతాడు. ఈరోజు కూడా అలాగే వెళ్లాడని చెబుతుంది. ఆ విషయం విన్న యువకుడు తిన్నగా జోషిగాయా వెళ్ళిపోతాడు.

ఆ యువకుడు పితృవనంలో సెన్సేను కలుస్తాడు. ఆసమయంలో అతని మొహంలో విచిత్రమైన విషాద ఛాయలు ఇట్టే కన్పించి అట్టే మాయమౌతాయి. అదెందుకో ఆ యువకుడికి అర్థంకాదు. మాటల సందర్భంలో సెన్సే ఆ యువకునితో "ఎంతో ఇష్టపడి పెళ్లి చేసుకున్న మా దంపతులం 'ఎంతో సుఖపడుతున్నాము'. అనాల్సినదానికి బదులుగా 'సుఖపడాల్సివుంది' అంటాడు. ఆ మాటల్లోని భావార్థాన్ని పట్టుకున్న యువకుడు, సెన్సే దంపతుల మధ్య సఖ్యత లేదన్న సందేహానికి లోనౌతాడు. అంతేకాదు వాళ్ళ వివాహం వెనుక ఏదో భయంకరమైన విషాధగాథ, ఏదో రమణీయమైన శృంగారగాథ కూడా వున్నాయని భావిస్తాడు.

ఆ విషయంలో స్పష్టతకోసం సెన్సే భార్యతో కూడా విషయాన్ని ప్రస్తావిస్తాడా యువకుడు. కానీ, ఆవిడకూడా ఎక్కడా బయటపడదు. ఇంతలో ఆ యువకుడికి ఇంటి దగ్గర తండ్రి ఆరోగ్యం బాగోలేదని తెలియడంతో ఇంటికెళ్ళిపోతాడు. వెళ్ళిన వాడు కాస్తా అక్కడి పరిస్థితుల కారణంగా చాలా రోజులు అక్కడే వుండి పోతాడు. అనుకోకుండా ఒకరోజు ఆ యువకుడికి సెన్సే దగ్గర్నుండి ఓ పెద్ద ఉత్తరం వస్తుంది.

ఆ ఉత్తరాన్ని విప్పగానే "ఈ ఉత్తరం నీ చేతికి అందేసరికి నేనీ లోకంలో లేకుండా పోతున్నాను. నేనీ నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో పూర్తి వివరాలు రాస్తున్నాను. చదివిన వెంటనే నా భార్యకు కూడా తెలియనివ్వకుండా దీన్ని చింపేయ్. నేను ప్రతినెలా ఏ సమాధి దగ్గరికి వెళుతున్నానో? ఆ సమాధికి, నా జీవితానికి, నా భార్య జీవితానికి కూడా ముడిపడి వున్న సంబంధమేమిటో నీకు తెలిసిపోతుంది. ప్రతిమనిషీ ఒక బలహీన క్షణంలో తెలిసో, తెలియకో తిరిగి తీసుకోలేనంత పెద్ద తప్పు చేస్తాడు. ఆ తప్పు ఒక్కోసారి ఎదుటి మనిషి ప్రాణాలను కూడా బలికోరుతుంది.

ఒకనాడు నేను చేసిన ఒకానొక పనివల్ల ఎంతో మంచి మనిషి, మేధావి, స్నేహశీలి, ఆధ్యాత్మిక వేత్త అయిన నా ప్రాణ మిత్రుడు కనుమరుగైపోయాడు. ఆ పశ్చాత్తాపంతోనే ఇప్పుడు నేనూ వెళ్లిపోతున్నాను" అంటూ రాసిపెట్టి వుంటుంది.

సెన్సే జీవితంలో మరుగున పడిన అనేక సంఘటనల తాలూకు వివరాలు ఆ ఉత్తరం చదివిన తరువాతనే పాఠకులకు నవలా సారాంశం పూర్తిగా అవగతమౌతుంది. పాఠకులు తప్పకుండా ఆ మిత్రుల మృతికి రెండు అశ్రు బిందువులను చిందిస్తారని భావిస్తున్నాను.

అనిల్ బత్తుల ప్రారంభించిన 'అనిల్ బత్తుల పబ్లికేషన్స్' ద్వారా ఇటీవలే వెలువరించిన 'సైకిల్ దొంగ' నవల తరువాత వెలువరించిన మరో నవల బహుశః ఇదేనేమో? ముందు ముందు కూడా ఈ సంస్థ నుండి మరిన్ని విలువైన పుస్తకాలు వెలువడుతాయని, పాఠకులను అలరిస్తాయని ఆశిద్దాం.

పబ్లికేషన్స్ : అనిల్ బత్తుల పబ్లికేషన్స్, పుస్తకం కోసం: 81792 73971 సంప్రదించవచ్చు. పేజీలు:110, వెల.రూ.120/- లు.

-శిరంశెట్టి కాంతారావు
98498 90322.

## అలా నడుస్తూనే ఉంటాది

మార్పు
కాల గమన సూత్రం

ఎపుడూ ఒకేలా ఉండదూ
కాలమైనా... నువ్వైనా

శీతాకాలపు శరీరంలా
కొంచెం పెళుసుగా బిరుసుగా
అప్పుడప్పుడు నువ్వు

దృశ్యాల స్పర్శకు
రాటుదేలిన గాజునేత్రాల్లా
గరుకు గరుకుగా క్రమంగా నువ్వు

నడిచి... నడిచి
స్పర్శ కోల్పోయిన నగ్న పాదాల్లా
మెల్లమెల్లగా
లోహంలా రూపాంతరం చెందుతూ
నువ్వు

మండు వేసవి ఉష్ణస్పర్శలా
గరం గరంగా
లావా దేహంతో ఒక్కోసారి నువ్వు

శైశవగీతిలోని
లేత జ్ఞాపకాలను నెమరేస్తూ
గతంలోకి జారిపోతూ అపుడపుడు
నువ్వు

ముసురుకొచ్చే
ముందు కాలపు పీడకలల
యుద్ధంలో మునిగి తేలుతూ తరుచూ
నువ్వు

కాలం జారిపోతుందో
నువ్వు జారిపోతున్నావో
తెలియని నిస్పృహ నిజం చాటున
నువ్వు

- డాక్టర్ బండి సత్యనారాయణ
99890 35136

నిర్వహణ :
విల్సన్‌రావు కొమ్మవరపు
సాహితీ సంపాదకులు
k.wilsonrao@gmail.com